## క్లుప్తంగా

### సమస్యలు పరిష్కరించండి



ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న కొత్తపల్లి గ్రామస్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని కోరంపల్లి మదిర గ్రామమైన కొత్తపల్లి గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీఓ రియాజొద్దీన్‌కు గ్రామస్తులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో మురుగు కాల్వలు, పైప్‌లైన్ లీకేజీలు, వీధిదీపాల, పరిసరాల అపరిశుభ్రతతో నానా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సమస్యలను సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శికి వివరించినా.. పట్టించుకోవడం లేదని తెలిపారు. గ్రామస్తులు ఉప్పరి మల్లయ్య, సంజీవులు, కిషన్, సాయిబాబా, లింగం, వెంకటేశ్, వేణు, మదు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

### ఘనంగా స్వయంపాలన దినోత్సవం

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కూచన్‌పల్లి జెడ్పీ హైస్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పర్యవేక్షించి ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

### కుష్ఠువ్యాధి నివారణపై చర్యలు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కుష్ఠువ్యాధి నివారణపై ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వైద్య సిబ్బంది కుష్ఠువ్యాధి నివారణపై, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ లక్ష్మణ్ సైబర్ క్రైమ్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### సాంప్రదాయాలపై అవగాహన

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులకు సాంప్రదాయాలపై అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సంస్కార్ పాఠశాలలో ట్రెడిషనల్ డే సందర్భంగా విద్యార్థులతో కలిసి గాలిపటాలను ఎగరవేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వసంతలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కవిత, రమాదేవి, కరస్పాండెంట్ సీతారామరావు తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తిపై హత్యాయత్నం

చిలప్‌చెడ్ (నర్సాపూర్): భూమి విషయంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగిన సంఘటన మండలంలోని రాందాస్‌గూడ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్ప వెంకటేశ్వరరావు అనే వ్యక్తి మేనమామ మురళీధర్‌రావు వద్ద సోమక్కపేట శివారులో 3 ఎకరాల భూమి కొనుగోలు చేసి, వ్యవసాయం చేసుకుంటున్నాడు. కాస్తులో ఉన్న భూమిలోకి గత ఏడాది జూన్ నుంచి మురళీ కుమారుడు అరుణ్‌కుమార్ అక్రమంగా తనదంటూ గొడవ పడుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు అతనిపై దాడి చేశారు. దాడిలో గాయలైన వెంకటేశ్వర్‌రావుని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాయని ఎస్‌ఐ తెలిపారు.

### సత్తా చాటిన విద్యార్థులు



గోల్డ్‌మెడల్స్‌తో విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): ఇంటర్నేషనల్ మర్షల్ ఆర్ట్స్ కరాటే పోటీల్లో నార్సింగి జెడ్పీపాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చి మూడు గోల్డ్ మెడల్స్ పొందారు. మంగళవారం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం మురళిమోహన్, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి విద్యార్థులను, కరాటే కోచ్ సంపత్, పీడీ శ్రీధర్‌రెడ్డిలను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాబు, మాజీ టెలికాం బోర్డ్ మెంబర్ రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రైస్‌మిల్ యజమానికి నోటీసు

శివ్వంపేట(నర్సాపూర్): ధాన్యం మిల్లింగ్ చేసి, బియ్యం అప్పగించని రైస్‌మిల్ యజమానికి నోటీసు జారీ చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి తెలిపారు. మండలంలోని రత్నపూర్ గ్రామ పరిధిలో ఉన్న లక్ష్మీనర్సింహా రైస్‌మిల్‌కు ఫారమ్–7, సెక్షన్ 36 ప్రకారం రైస్‌మిల్ యజమాని లంబాద్రిరావ్‌కి మంగళవారం నోటీసు జారీ చేశారు. నెల రోజుల లోపు ప్రభుత్వానికి బాకీ ఉన్న రూ.4 కోట్ల లక్ష 65 వేల 507 చెల్లించకపోతే ఫిబ్రవరి 29న రైస్‌మిల్‌తో పాటు యజమాని కుటుంబ సభ్యుల పేరిట రత్నపూర్, కొత్తపేట గ్రామ పరిధిలోని పట్టా భూమి 8 ఎకరాల 32 గుంటలు వేలం వేస్తున్నట్లు చెప్పారు.

# ఎలక్షన్ డిపాజిట్ డబ్బులు ఇవ్వరా?

టేక్మాల్ సర్వసభ్య సమావేశంలో అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం




మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణ

టేక్మాల్(మెదక్): గతంలో జరిగిన ఎలక్షన్‌లో నిలబడిన అభ్యర్థుల డిపాజిట్ డబ్బులు ఎందుకు ఇవ్వలేదని జిల్లా కోఆప్షన్ సభ్యులు యూసూఫ్, ఎంపీటీసీ వాణి అధికారులను ప్రశ్నించారు. మండల కేంద్రం టేక్మాల్‌లో ఎంపీపీ స్వప్న అధ్యక్షతన, ఎంపీడీఓ రియాజొద్దీన్ ఆధ్వర్యంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. డిపాజిట్ డబ్బులు అడిగితే మాట దాటవేస్తున్నారని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కృష్ణ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వ భూమి అవసరమైతే తమ దృష్టికి తీసుకొస్తే సాధ్యమైనంత వరకు ప్రభుత్వ భూమిని అప్పగిస్తామని తెలిపారు. ఎంపీటీసీ వాణి, కోఆప్షన్ సభ్యుడు మజహర్ మాట్లాడుతూ.. దనూరలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని, టీచర్ కొట్టడంతో ఆస్పత్రి పాలయ్యాడని ఎంఈఓ నీలకంఠంపై మండిపడ్డారు. సర్పంచ్ నారాయణ మాట్లాడుతూ.. వెల్పుగొండ, సూరంపల్లి గ్రామాల్లో తూములు సక్రమంగా లేకపోవడంతో సాగునీరంతా వృథాగా పోతుందని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. సర్పంచ్ యాదయ్య మాట్లాడుతూ.. కాద్లూర్‌లో చెరువుకు తూము కట్టి షటర్ పెట్టలేదని, ప్రభుత్వం ఇచ్చిన చేప పిల్లలు పెరగడంలేదన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని ఎంపీపీ తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సర్వని సరోజ, వైస్ ఎంపీపీ మంజుల రాజుగౌడ్, ఏఓ రాం ప్రసాద్, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# క్రీడల్లో ప్రతిభ చాటాలి



సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): బాలికలు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటాలని ప్రత్యేకాధికారి అంజలి అన్నారు. మూడునెలలుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన మార్షల్ ఆర్ట్స్ శిక్షణ కార్యక్రమం ముగియనుంది. మంగళవారం ఈ సందర్భంగా మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు పోచయ్య మండల పరిధిలోని చిటుకుల్ కేజీబీవీలో శిక్షణ పొందిన విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో పరీక్ష నిర్వహించి, బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశాడు. కార్యక్రమంలో ఎస్‌ఓ అంజలి, శిక్షకులు మురళి, మహేశ్‌గౌడ్, సంజన, శృతి, వర్షిత, ఉపాధ్యాయ సిబ్బంది ఉమామహేశ్వరి, పద్మావతి, ప్రశాంతి, మంజుల, మధులత, కీర్తి పాల్గొన్నారు.



టేక్మాల్‌లో సర్పంచ్‌లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

# సర్పంచ్‌ల సేవలు అభినందనీయం

టేక్మాల్(మెదక్): గ్రామాల్లో ప్రజలకు సేవలు అందించిన సర్పంచ్‌ల పనితీరు అభినందనీయమని ఎంపీపీ స్వప్న తెలిపారు. మంగళవారం ఎంపీపీ, ఎంపీడీఓ రియాజొద్దీన్ ఆయా గ్రామాల సర్పంచ్‌లను సన్మానించారు. జెడ్పీటీసీ సర్వని సరోజ, జిల్లా కోఆప్షన్ సభ్యులు యూసూఫ్, మండల వైస్ ఎంపీపీ మంజుల, మండల కోఆప్షన్ సభ్యులు మజహర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప, ఎంపీటీసీలు వాణి, నారాయణరెడ్డి, సురేందర్‌రెడ్డి, అంజమ్మ, మోహన్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

# సీఎం సహకారంతో అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ: సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మెదక్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్మన్ చంద్రపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. ప్రజలు మమ్మల్ని నమ్మి ఓటు వేసి గెలిపించారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి చేస్తామన్నారు. గత ఎన్నికలకు ముందు మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించిన టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.20 కోట్లు, ప్రత్యేక నిధులు రూ.50కోట్లు వెనక్కి వెళ్లినట్లు మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ సభ దృష్టికి తీసుకొచ్చారు. 9వ వార్డు కౌన్సిలర్ కల్యాణి మాట్లాడుతూ.. పట్టణంలో తీవ్రంగా ఉన్న కోతులు, వీధి కుక్కల సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. కౌన్సిలర్ లలిత మాట్లాడుతూ.. పట్టణాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. అంతకు ముందు మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్‌తో పాటు కౌన్సిలర్లు, కమిషనర్ ఎమ్మెల్యే రోహిత్‌రావును సన్మానించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్, కౌన్సిలర్లు రాజలింగం, శేఖర్, సమీయొద్దీన్, లక్ష్మి, రుక్మిణి, మేఘమాల, చందన, వనజ పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు సన్మానం**

మెదక్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరిలో నిర్వహించే నేషనల్ సెమినార్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా సెమినార్ బ్రౌచర్‌ను మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేను జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత సన్మానించారు.

### రామాయంపేట సీఐగా వెంకటేశ్



రామాయంపేట(మెదక్): పట్టణంలోని పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన వెంకటేశ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన సీఐ లక్ష్మీబాబును ఐజీ కార్యాలయానికి అటాచ్ చేయగా, ఆయన స్థానంలో మెదక్ టౌన్ సీఐగా పనిచేస్తున్న వెంకటేశ్‌ను రామాయంపేట సీఐగా నియమించారు.

### నర్సాపూర్ సీఐగా రంగ కృష్ణ



నర్సాపూర్ రూరల్: సిద్దిపేట జిల్లా గజ్వేల్ నుంచి నర్సాపూర్‌కు బదిలీపై వచ్చిన సీఐ రంగ కృష్ణ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు.

### నేటి నుంచి చాముండేశ్వరీ ఉత్సవాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): భక్తుల కొంగు బంగారంగా వెలసిల్లుతుంది చాముండేశ్వరీ అమ్మవారు. మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ సమీపంలో మంజీరా తీరాన పచ్చటి పొలాల మధ్యన ఈ ఆలయం వెలసింది. దక్షణ భారత దేశంలో రెండో అతిపెద్ద ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఆలయంలో చాముండేశ్వరీ అమ్మవారు శక్తి స్వరూపిణిగా, తొమ్మిది అడుగుల ఎత్తు, 18 చేతులతో జ్వాలా కిరీటం ధరించి భక్తులకు దర్శనమిస్తుంది. బుధవారం నుంచి శుక్రవారం వరకు చాముండేశ్వరీ అమ్మవారి 41వ ఆలయ వార్షిక ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.

### కరాటేలో ప్రతిభ



బ్లాక్ బెల్ట్ అందుకుంటున్న ప్రసన్న

నర్సాపూర్‌రూరల్: మండలంలోని రుస్తుంపేటకు చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో బ్లాక్ బెల్ట్ గోల్డ్ మెడల్ సాధించి హీరో సుమన్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంది. హైదరాబాద్‌లో జరిగిన కరాటే పోటీల్లో పాల్గొన్న మద్దికుంట ప్రసన్నకు సుమన్ బ్లాక్ బెల్ట్, సర్టిఫికెట్ అందించారు. కరాటే మాస్టర్లు నగేష్, అశోక్ ప్రసన్నను అభినందించారు.

### గొర్రెలకు టీకాలు

నర్సాపూర్ రూరల్: ఫిబ్రవరి మొదటి వారంలో గొర్రెలకు నీలి నాలుక వ్యాధి టీకాలు (బ్లూ టంగ్) పంపిణీ చేస్తామని పశుసంవర్ధక శాఖ ఏడీ వెంకటయ్య తెలిపారు. మంగళవారం నర్సాపూర్ పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీ జనార్దన్ రావు ఉన్నారు.



చేగుంట ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లకు సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

# పెండింగ్ బిల్లులు వచ్చేలా కృషి చేస్తా

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి




శివ్వంపేట(నర్సాపూర్): సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): పెండింగ్ బిల్లులు వచ్చేలా కృషి చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మంగళవారం శివ్వంపేట మండల సర్వసభ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీకాలం పూర్తి చేసుకుంటున్న సర్పంచ్‌లను ఎంపీపీ హరికృష్ణ ఆధ్వర్యంలో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ భారతి, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, మండల సర్పంచ్‌ల పోరం అధ్యక్షురాలు లావణ్యరెడ్డి, ఎంపీటీసీ, అన్ని గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**సర్పంచ్‌ల చొరవతోనే అభివృద్ధి పనులు**

చేగుంట(తూప్రాన్): సర్పంచ్‌ల చొరవతోనే గ్రామాల్లో గుర్తుండే అభివృద్ధి పనులు జరిగాయని ఎంపీడీఓ ఆనందమేరీ అన్నారు. మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లను ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీఓ సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, కోఆప్షన్‌మెంబర్ మహ్మద్‌అలీ, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముప్పారం తండాలో ప్రారంభమైన పాఠశాల



పాఠశాలకు హాజరైన విద్యార్థులు



పాఠశాలలో పాఠం చెప్తున్న టీచర్

అల్లాదుర్గం(మెదక్): ప్రాథమిక విద్య అస్తవ్యస్తం అనే శీర్షికతో ఈ నెల 25న 'సాక్షి' దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన జిల్లా విద్యాధికారులు మండల పరిధిలోని ముప్పారం తండాలో పాఠశాలను మంగళవారం పునఃప్రారంభించారు. ఈ పాఠశాలలో 19 మంది విద్యార్థులకు 17 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాక్షి కథనంతో పాఠశాల ప్రారంభం కావడంతో తండా వాసులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్

# గ్రామాల అభివృద్ధికి కృషి: సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నాగ్సాన్‌పల్లిలో రూ. 20లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌దే అని అన్నారు. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కోసం పంచాయతీ భవనాలను మంజూరు చేశారని చెప్పారు. గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించడంతో పాటు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నాగ్సాన్‌పల్లి గ్రామానికి అంగన్‌వాడీ భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, మురికి కాల్వ కావాలని సర్పంచ్ ఎల్లం కోరడంతో మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. సర్పంచ్ ఎల్లం, ఉపసర్పంచ్ నరహరి, వార్డు సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజునాయక్, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, పీఆర్‌డిప్యూటీఈఈ అమరేశ్వర్, ఏఈ ప్రభాకర్, మాజీ సీడీసీ చైర్మన్ దుర్గారెడ్డి, ఎంపీటీసీలు స్వప్న, ప్రవీణ్‌కుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు సంజీవ్, లింగంగౌడ్, నర్సింగారావు, చంద్రశేఖర్‌గుప్తా, నాయకులు అమర్‌సింగ్, మనోహర్‌రెడ్డి, సలీం, లక్ష్మయ్య, ప్రతాప్‌గౌడ్, నర్సింలు, రాములు, రవిసాగర్ పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ రేణుక

అల్లాదుర్గం(మెదక్): సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అల్లాదుర్గం సీఐ రేణుక సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు తమ స్మార్ట్ ఫోన్‌లకు ఓటీపీ చెప్పొమంటే చేప్పొద్దని, అనవసరమైన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే, అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఏదైన ఇబ్బంది ఉంటే నేరుగా కలవచ్చని చెప్పారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షనే తమ లక్ష్యమన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు, యువతకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

# పాఠశాలలో విచారణ

సాక్షి ఎఫెక్ట్



విచారణ చేస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులపల్లి కోమటికుంటతండా పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాధాకిషన్ విచారణ చేశారు. మంగళవారం సాక్షి దినపత్రికలో ఉపాధ్యాయురాలిపై చర్య తీసుకోవాలి అనే శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎంఈఓ బుచ్యానాయక్ ఆదేశాలతో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాధాకిషన్ కోమటికుంట పాఠశాలకు వెళ్లి విచారణ చేశారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయురాలి హాజరు పరిశీలించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ రమేశ్‌ను పిలిచి మధ్యాహ్న భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీచర్‌పై చర్యలు తీసుకోవాలని తండావాసులు తెలిపారు.

## సంక్షిప్త వార్తలు

◆ **హరీశ్‌రావును విమర్శించే స్థాయి కాదు**

చిన్నశంకరంపేట(మెదక్): మాజీ మంత్రి హరీశ్‌రావును, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డిని విమర్శిస్తున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్ అభివృద్ధిపై దృష్టి సారించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజు కోరారు. మంగళవారం వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు శివకుమార్, ఫిషరీస్ జిల్లా డైరెక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. హరీశ్‌రావును విమర్శించే స్థాయి ఎమ్మెల్యే రోహిత్‌కు లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు హేమ చంద్రం, దుర్గపతి, నరేష్ ఉన్నారు.

◆ **కాల్వ ధ్వంసం**

చేగుంట(తూప్రాన్): మండలంలోని బోనాల్ గ్రామ శివారులోని రామాయంపేట కాల్వను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న రామాయంపేట కాల్వ డీఈ బండారి నరేష్ ధ్వంసం చేసిన కాల్వను పరిశీలించారు. ఈమేరకు కాల్వను ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డీఈ నరేశ్ పేర్కొన్నారు.

◆ **ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన**


చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని జప్తిశివనూర్ గ్రామంలో ఎయిడ్స్ నియంత్రణపై ప్రభుత్వ కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ షరీఫ్, కళాబృందం సభ్యులు భుజంగం, చామంతి, మురళి, ఓంకార్, స్కోప్ స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ రజిత ఉన్నారు.

◆ **గ్రామాల్లో అభివృద్ధికి ప్రత్యేక నిధులు**

చేగుంట(తూప్రాన్): గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరీ చేయిస్తున్నట్లు కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కాళేశ్వరం కాల్వ ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాంపూర్ గ్రామ శివారులోని కాల్వను పరిశీలించారు. కార్యక్రమంలో రాంపూర్ సర్పంచ్ భాస్కర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్, శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

◆ **సిబ్బందిని విధుల్లోకి తీసుకోండి**

టేక్మాల్(మెదక్): మండలంలోని సాక్షరభారత్ సిబ్బందిని విదుల్లోకి తీసుకోవాలని సాక్షర భారత్ కోఆర్డినేటర్‌లు మంగళవారం ఎంపీడీఓ రిజాజొద్దీన్‌కు వినతిపత్రం అందించారు. ఇందులో మండల సాక్షరత్ భారత్ కోఆర్డినేటర్ సంగమేశ్వర్, ఆయా గ్రామాల సాక్షర భారత్ కోఆర్డినేటర్లు ఉన్నారు.



◆ **బీజేపీ బలోపేతానికి కృషి**

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జహీరాబాద్ పార్లమెంట్ మహిపాల్ రెడ్డి, ఖేడ్ నియోజకవర్గం ఇన్‌చార్జి సంగప్ప, మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పేట మండల అధ్యక్షుడు కోణం విఠల్, నాయకులు రజనీకాంత్, పట్నం మాణిక్యం, మండల నాయకులు పాల్గొన్నారు.

◆ **తూప్రాన్ సీఐగా కృష్ణ**



తూప్రాన్: తూప్రాన్ సీఐగా ఆర్. కృష్ణ నూతనంగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు విధులు నిర్వర్తించిన శ్రీధర్ బదిలీపై హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.

◆ **దాడులు ఆపాలి**



వెల్దుర్తి(తూప్రాన్): పౌల్ట్రీ ఫారాలపై విజిలెన్స్ దాడులు ఆపాలని ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని పౌల్ట్రీ రైతులు మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పెంటారెడ్డి, హరిబాబు, నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్యాసదస్సు కరపత్రాల ఆవిష్కరణ**

రామాయంపేట(మెదక్): తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్న విద్యా సదస్సును జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సంగయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాంరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రామాయంపేట, నిజాంపేట మండలాల పరిధిలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులతో కలిసి విద్యా, వైజ్ఞానిక క్యాలెండర్లను ఆవిష్కరించారు.

◆ **ఈపాస్ మిషన్ ద్వారా ఎరువుల విక్రయించాలి**

చిన్నశంకరంపేట(మెదక్): ఎరువుల విక్రయాలు ఈపాస్ మిషన్ ద్వారానే జరగాలని నార్సింగి వ్యవసాయ అధికారి యాదగిరి సూచించారు. మంగళవారం నార్సింగి మండల కేంద్రంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు.